



తిరుపతిలో..



శ్రీకాళహస్తిలో..

ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం ఆపాలి..!

పాలస్తీనాకు మద్దతుగా... సంఘీభావ నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని, సామ్రాజ్యవాద అమెరికా యుద్ధోన్మాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్థిల్లాలని వామపక్ష పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆర్.టి.సి బస్టాండు దగ్గర వున్న గాంధీ బొమ్మ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిరసన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు నాగ సుబ్బారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వెంకటరత్నం, ఎస్ యు ఎస్ ఐ (కమ్యూనిస్టు) జిల్లా నాయకులు ప్రతాప్ సింగ్, ఆర్పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయెల్ ఏకపక్షంగా చేస్తున్న యుద్ధం నెల రోజులు దాటిందని, వేలాదిమంది ఈ మారణకాండలో బలయ్యారని అన్నారు. శరణార్థుల శిబిరాలపై బాంబుదాడులు జరుగుతున్నాయని పసిపిల్లలు, మహిళలు, పౌరుల శవాల గుట్టలు హృదయవిదారకంగా ఉన్నాయని ప్రపంచంలో అనేక దేశాలలో ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నా అమెరికా ప్రోత్సాహంతో ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదన్నారు. సామ్రాజ్యవాద అమెరికా తన ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్‌ను తన బ్రాంచ్ ఆఫీసుగా చేసుకుని యుద్ధాన్ని ప్రేరేపిస్తుందని, పాలస్తీనా ప్రజల కాంక్ష మేరకు వారికి స్వతంత్ర దేశాన్ని ఏర్పాటు చేయాల్సింది పోయి..,అక్కడి ప్రజలను అణచి వేస్తున్నారని అన్నారు.అణచివేతకు వ్యతిరేకంగా, తమ ఉనికి కోసం మిలిటెంట్లుగా మారి సాయుధ బలగం ద్వారా ఇజ్రాయెల్ పై దాడులకు తెగబడిన హమాస్ ఉగ్రవాద సంస్థ సభ్యులను శిక్షించడం పోయి సామాన్య ప్రజలపైన, డాక్టర్లు, పసిపిల్లల మీద బాంబు దాడులు చేయడం అన్యాయమని అన్నారు. గతంలో ఇదే హమాస్ సంస్థకు అమెరికా ఆయుధాలతో ప్రోత్సహించిన విషయం మరవకూడదని అన్నారు. ఇజ్రాయెల్ దాడుల ఫలితంగా పాలస్తీనాలో పది వేలకు పైగా ప్రజలు మరణించడం.. ఇందులో 2 వేలకు పైగా చిన్నపిల్లల మరణించడం హేయమని అన్నారు. ప్రపంచపు యుద్ధ నీతిని పాటించకుండ వైద్యులు, పేషంట్లు వున్న హాస్పిటల్లపై దాడి చేయడం, శరణార్థి శిబిరాలపై బాంబులు వేయడం చూస్తే ఇది రెండు వైపుల నుండి జరిగే యుద్ధం కాదని.. అమెరికా అండతో ఇజ్రాయెల్ చేస్తున్న దమనకాండని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శిలు జల్లా విశ్వనాథ్ ,టీ సుబ్రహ్మణ్యం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కేతారి రాధాకష్ణ, సిపిఎం నాయకులు వేణు, బుజ్జి , సిపిఐ ఎంఎల్ నాయకులు గంగా, మునీంద్ర ఎస్ యు ఎస్ ఐ పార్టీ నాయకులు హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరులో..

శ్రీకాళహస్తిలో... సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. అమెరికాసామ్రాజ్యవాదం నశించాలి, ప్రపంచ శాంతి వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. పాలస్తీనా భూభాగం పాలస్తీనాదేనని మహాత్మాగాంధీ ఎపుడో చెప్పారని గుర్తు చేశారు. అయితే పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయెల్‌కు భారత ప్రభుత్వం మద్దతు పలకడం దారుణమని అన్నారు. సిపిఐ నాయకులు జనమాల గురవయ్య, పీడిఎస్యు నాయకులు జాకీర్, సిపిఎం నాయకులు గంధం మణి, వెలివేంద్రం, రాజా అన్వర్ బాషా, ఉస్మాన్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.**పుత్తూరు టౌన్‌లో...** అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సెల్వరాజా ఆచారి, రవి, పురుషోత్తం, సుబ్రమణ్యం, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి కార్తీక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● శాస్త్రోక్తంగా ధ్వజారోహణం ● పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి - తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకం జరిపారు. అనంతరం నాలుగుమాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం జరిపి, ధ్వజ స్తంభ తిరుమంజనం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రం ఉన్న ధ్వజ పటాన్ని ఆరోహణం చేశారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి దంపతులు, జేఈవో సదా భార్గవి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో గోవింద రాజన్, విజివో బాలిరెడ్డి, ఉద్యాన విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు, పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాస చార్యులు, కంకణ భట్టర్ మణికంఠ స్వామి, అర్చకులు బాబు స్వామి, వేంపల్లి శ్రీను స్వామి పాల్గొన్నారు. అనంతరం ఈవో ఎవి ధర్మారెడ్డి జేఈవో లతో కలిసి ఉద్యాన విభాగం ఏర్పాటు చేసిన పుష్పప్రదర్శన, శిల్పకళా శాల ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శన, తిరుమల -తిరుపతి స్విరుచువల్ సొసైటీ ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన శాలను ప్రారంభించారు. ఈవో ఎవి ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. రాత్రి 7నుండి 9 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారు చిన్న శేష వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు.

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి జేఈవో వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, విజివో బాలిరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పుష్ప ప్రదర్శనశాల

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుచానూరులోని శుక్రవారపుతోటలో ఏర్పాటుచేసిన పుష్ప ప్రదర్శనశాల భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో టీటీడీ ఉద్యాన విభాగం ఆధ్వర్యంలో 'సోమకాసురుడు అనే రాక్షసుడిని సంహరించి నాలుగు వేదాలను బ్రహ్మకు మత్స్య అవతారంలో అందిస్తున్న శ్రీమహావిష్ణువు ప్రతిమలు ఏర్పాటు చేశారు . అరణ్యవాసమున సీతమ్మను



వెతుకుతూ వెళ్లిన శ్రీరామ లక్ష్మణులకు పండ్లు, తేనే ఆతిథ్యమిస్తున్న భక్త శబరి ప్రతిమల నమూనా భక్తులను ఆకర్షిస్తోంది . వాల్మీకి మహర్షి ఆశ్రమంలో శ్రీరామ కథను ఆలపిస్తున్న లవకుశులు, లక్క గహంలో నిద్రిస్తున్న భీమసేనుడిని పాటతో మేల్కొలుపుతున్న ముసలి రూపంలో శ్రీకష్ణుడు ప్రతిమలు ఏర్పాటు చేశారు . అర్జునుడు బాణాలతో స్వర్గానికి నిర్మించిన నిచ్చెనతో ఐరావతాన్ని తీసుకురావడానికి బయలుదేరుతున్న భీమసేనుడు, అన్నమయ్య తన ఇద్దరు భార్యలతో శ్రీవారిపై కీర్తనలను ఆలపిస్తున్న ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి .అదేవిధంగా, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ఎక్స్‌పో ఆయు, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసి ఆధ్వర్యంలో వనమూలికా ప్రదర్శన, ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్వీ సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ ఏర్పాటు చేసిన శిల్ప కళ ప్రదర్శనశాల భక్తులను ఆకట్టుకుంటోంది.

శ్రీవారి అభిషేక సేవలో మహారాష్ట్ర సీఎం

ప్రజాశక్తి -తిరుమల, తిరుచానూరు, శ్రీకాళహస్తి

మహారాష్ట్ర సీఎం ఎక్ నాథ్ షిండే కుటుంబ సమేతంగా తిరుమలకు వచ్చారు. గురవారం రాత్రి ప్రత్యేక విమానంలో తిరుపతికి చేరుకున్న మహారాష్ట్ర సీఎం..రోడ్డు మార్గంలో తిరుమల చేరుకున్నారు. శుక్రవారం ఉదయం అభిషేక సేవ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం షిండే దంపతులకు రంగనాయకుల మండపంలో వేదపండితుల ఆశీర్వచనం చేసి.. శ్రీవారి తీర్థ ప్రసాదాలను టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అందజేసారు. అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సీఎం షిండే వెంట మహారాష్ట్రకు చెందిన టీటీడీ పాలక మండలి సభ్యులు సౌరభ్ భోరా, మిలింద్ నర్వేకర్ ఉన్నారు. వారే దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చూసుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం షిండే తిరుమల నుంచి ముంబైకి తిరిగి వెళ్లారు. తిరుచానూరులో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వ రాలయానికి విచ్చేశారు. వీరికి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముక్కంటి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో సాగర్‌బాబు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

పీఎంజే జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పీఎంజే జ్యువెలరీస్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన జ్యువెలరీ ఎగ్జిబిషన్ ను తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష శుక్రవారం ప్రారంభించారు. స్థానిక లక్ష్మీపురం సర్కిల్ వద్దనున్న పిఎల్ఆర్ కన్వెన్షన్ హాల్ వద్ద జ్యోతి ప్రజ్వలనంతో ప్రదర్శన ప్రారంభించారు. అందులో ఏర్పాటు చేసిన ఆభరణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఎంజే బిజినెస్ హెడ్ రామ్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలో ధన త్రయోదశి పురస్కరించుకొని, నవంబర్ 11, 12 తేదీల్లో రెండు రోజులు పాటు పీఎంజే జ్యువెలర్స్ ప్రదర్శన, అమ్మకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ హీరో మహేష్ బాబు కుమార్తె సితార అంబాసిడర్ గా ఉన్న సితార కలెక్షన్ ను ఇక్కడ అందుబాటులో ఉంచామన్నారు. సరికొత్త డిజైన్లతో మహిళలను ఆకర్షించే ఆభరణాలను ప్రదర్శనలో విక్రయానికి ఏర్పాటు చేశామన్నారు. రెండు లక్షలు పైగా కొనుగోలు చేసిన వారికి గోల్డ్ కాయిన్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఎగ్జిబిషన్ సందర్భంగా ప్రత్యేకంగా 11 ప్లస్ 1 స్కీమును వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పి ఎం జె ఏర్పాటు చేసిన స్కీమును ఇక్కడ అందుబాటులో ఉంచామని, ఈ స్కీమ్ ద్వారా 75శాతం నగదు కట్టిన వినియోగదారులకు, యాజమాన్యం మరో 25శాతం నగదును వ్యయం చేసీ నాణ్యమైన ఆభరణాలను అందిస్తుందన్నారు. 15వేల రూపాయల నుంచి 50 లక్షల రూపాయలు విలువచేసే ఆభరణాలను అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేల్స్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల నుండి జరుగుతున్న 67 వ రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల బాలుర స్విమ్మింగ్ పోటీలు శుక్రవారం ముగిశాయి. తిరుపతి లోని శ్రీనివాస క్రీడా సముదాయం వేదికగా జరిగిన ఈ పోటీలలో రాష్ట్రం నలుమూలల నుండి దాదాపు 550 మంది క్రీడాకారులు అండర్-14, అండర్-17,అండర్-19 విభాగాలలో పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ చూపిన వారిని త్వరలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని టోర్నీ నిర్వాహక కార్యదర్శులు విజయకుమారి, జయరామయ్య తెలియజేశారు. అత్యున్నత అనుభవం కలిగిన టెక్నికల్ కమిటీ, పర్యవేక్షకుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించామన్నారు. పోటీలలో పాల్గొన్న క్రీడాకారులందరికీ ఎటువంటి లోటుపాట్లు లేకుండా వసతి, భోజనం, రవాణా సౌకర్యాలను అందజేశామన్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్గనైజింగ్ కార్యదర్శి విజయకుమారి విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ తిరుపతి వేదికగా ఇంతపెద్ద టోర్నమెంట్ ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించడం తిరుపతికే గర్వకారణం అన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు జాతీయ పోటీలలోనూ అత్యంత ప్రతిభ చూపి రాష్ట్రానికి మంచిపేరు తీసుకుని రావాలన్నారు.

ఈ కార్యక్రమంలో అబ్జర్వర్లు వీరాంజనేయులు, డా.ప్రభాకర్ రావు, ఛీఫ్ కోచ్ సయ్యద్ సాహెబ్, స్విమ్మింగ్ శిక్షకులు ఆది, వ్యాయామోపాధ్యాయులు శ్రీధర్, మునెయ్య, ప్రసన్న, సుధ పాల్గొన్నారు.





ఘనంగా ప్రపంచ సైన్సు దినోత్సవం

ప్రజాశక్తి- రేణిగుంట

రేణిగుంట జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలల లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభలో జనవిజ్ఞాన వేదిక తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు ఓ వెంకట రమణ మాట్లాడుతూ " సైన్స్ మానవులకు సౌకర్యవంతమైన, ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఇచ్చిందన్నారు. ఆయుఃప్రమాణాన్ని పెంచిందన్నారు. ప్రజలందరికీ తప్పనిసరిగా కనీస శాస్త్రీయ అంశాలు తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. సూడోసైన్స్, యాంటీసైన్స్‌కు వ్యతిరేకంగా అసలైన సైన్స్‌ను ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైన్సు అధ్యాపకులు విజయకుమార్ ఉపాధ్యాయులు మోహన నాయుడు, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఇమామ్ పాల్గొని ప్రసంగించారు.

కాలుష్య రహిత దీపావళి నిర్వహించాలి

ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ గౌతమి

ప్రజాశక్తి- రేణిగుంట

పట్టణంలోని ఆక్స్ఫర్డ్ స్కూల్ లో శుక్రవారం దీపావళి పండుగ పురస్కరించుకొని పర్యావరణం పట్ల బాధ్యతగా ఉండాలంటూ విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాలైన కళాకతులు, చిత్రపటాలు మట్టి దివ్వెలు, కాగితపు దివ్వెలతో అందంగా తీర్చిదిద్ది ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శన ఉత్సవం విజయవంతంగా జరిగింది. ఇటువంటి ప్రదర్శన వలన విద్యార్థులకు టపాకాయలు కాల్చడం వలన పర్యావరణం కాలుష్యం ఏర్పడుతుందని, గాలి నీరు నేల కలుషితం అవుతాయని, జంతువులకు మానవులకు హానికరం కలుగజేస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శన ఉత్సవానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు వారికి నచ్చిన వస్తువులు కొనుగోలు చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గౌతమి, రెస్పాండెంట్ మురళీకష్ణ మాట్లాడుతూ కాలుష్య రహిత దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు.

ట్రాన్స్‌జెండర్లకు దీపావళి కానుక

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా భవాని నగర్ లోని విహెచ్‌ఎస్ వన్ స్టాప్ సెంటర్లో ఘనంగా దీపావళి వేడుకలు జరిగాయి, ఇందులో ట్రాన్స్ జండర్స్ పాల్గొన్నారు. వారి పట్ల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ సమాజంలో ఏ రకమైన పనులకైనా, ఏ రకమైన అభివద్ధి కార్యక్రమాలైనా ముందుండాలని ప్రోత్సహిస్తూ దీపావళి వేడుకలు జరిపారు. ఇందులో ఉయ్ సపోర్ట్ వ్యవస్థాపకురాలు తహసునిసా బేగం మాట్లాడుతూ ఏ ఒక్క ట్రాన్స్ జెండర్ కైనా తమ సంస్థ ముందుండి సాయం చేస్తుందన్నారు. భవాని నగర్లోని విహెచ్ఎస్ వన్ స్టాప్ సెంటర్లోని కోఆర్డినేటర్ అపర్ణ, మురళి ఆధ్వర్యంలో 30 మంది ట్రాన్స్ జెండర్లకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేటర్ నరేంద్రనాథ్, నాగార్జున, నడ్డి నారాయణ, ముఖేష్ పాల్గొన్నారు , ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సంధ్య, శివ కుమార్, సదా యోగి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఆర్ఎస్‌లో ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతి నందు నవంబర్ ఒకటవ తేదీన ప్రారంభమైన ప్రకృతి సేద్యంపై జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి.రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ బోర్డు సభ్యులు ప్రొఫెసర్ గురుమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమ డైరెక్టర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగ మాధురి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల నుండి 50 అప్లికేషన్లు రాగా అందులోనుండి అర్హతల ఆధారంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, కేరళ, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన 35 మందిని పది రోజుల శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేశామన్నారు. సేంద్రీయ, ప్రకతి వ్యవసాయంపై జాతీయ సలహాదారులు డాక్టర్ ఏకే యాదవ్, సేంద్రియ వ్యవసాయంపై నేషనల్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎన్ రవిశంకర్, ఇక్రిశాట్ కి చెందిన డాక్టర్ గజానన్, రైతు సాధికారక సంస్థ వైస్ చైర్మన్ టి. విజయ్ కుమార్, తెలంగాణకు చెందిన పద్మశ్రీ చింతల వెంకటరెడ్డి, ఐసిఏఆర్ అవార్డు పొందిన రైతు వై.జగదీశ్వరరెడ్డి, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక,



ఇతర రాష్ట్రాలకు చెందిన మొత్తం 34 మంది నిష్ణాతులచే కార్యక్రమంలో పాల్గొన్న వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. ఇందులో 10 ఉపన్యాసాలు ఆన్ లైన్ ద్వారా జరగగా మిగిలిన 24 ఉపన్యాసాలు ఆఫ్ లైన్లో జరిగాయని తెలిపారు. ఈ పది రోజులపాటు కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రకృతి వ్యవసాయం పుట్టుక, చరిత్రతో మొదలుపెట్టి, సాగు పద్ధతులు, సర్టిఫికేషన్ లో విధి విధానాలు, మార్కెటింగ్ వ్యూహాలు తదితర అంశాలను వివరించడం జరిగిందని తెలిపారు. శిక్షణ కార్యక్రమం మరొక డైరెక్టర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.కష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ పది రోజులు శిక్షణ అనంతరము కార్యక్రమంలో పాల్గొన్న వారికి 60 నుంచి 80 శాతం వరకు పరిజ్ఞాన అభివద్ధి జరిగిందని తెలిపారు.

15న సిపిఎం ప్రజాభేరిని జయప్రదం చేయండి : వి.నాగరాజు

ప్రజాశక్తి - రేణిగుంట

ఈనెల 15న విజయవాడలో జరగనున్న సిపిఎం ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం రేణిగుంట మండలం తారకరామానగర్, సుందరయ్యకాలనీల్లో ప్రచారం నిర్వహించారు. తారకరామానగర్‌లో వందలాది మందికి ఇంటి స్థలాలు చూపించలేదని, కోర్టులో ఉన్నదని సాకులు చెబుతున్నారని ఆరోపించారు. అదే సందర్భంలో ఇంటి స్థలాల కోసం కేటాయించిన భూములు కోర్టులో ఉన్నా వైసిపి నేతలు స్వాహా చేస్తున్నారన్నారు. ఇళ్లు వేసుకుని ఏళ్ల తరబడి కాపురం ఉంటున్నా వసతుల్లేవన్నారు. కాపురాలు ఉండేచోట వెంటనే తాగునీరు, కరెంట్, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులకు ఇసుక అమ్ముకోడానికి, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోడానికి ఉండే అక్కర, ప్రజా సమస్యల పట్ల లేదని ఆరోపించారు. దమ్ముంటే కమ్యూనిస్టుల్లా బతికి చూడాలని సవాల్ విసిరారు. సుందరయ్య కాలనీలో పేదలు నీళ్ల లేకుండా ఆరేళ్లుగా వనవాసం చేస్తున్నా దయలేదని, తాగునీటి పైప్‌లైన్‌కు అడ్డంకులు చెప్పడం దారుణమని అన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి మునిరాజా, వెంకటరమణ, సెల్వరాజ్, సత్యశ్రీ, సుజాత, రాజశేఖర్, లక్ష్మి, ఎర్రస్వామిపాల్గొన్నారు.

పాకాలలో.. అసమానతలు లేని అభివృద్ధి కోసం చలో విజయవాడకు తరలి రావాలని సిపిఎం నాయకులు మధుసూదన్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను పంచిపెట్టారు.

స్వర్ణ ఆస్పత్రిని ప్రారంభించిన మేయర్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్ణ హాస్పిటల్ ను తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. స్థానిక లీలామహల్ సర్కిల్ సమీపంలోని కొర్లగుంట ఎస్బిఐ బ్రాంచ్ ఎదురుగా ఏర్పాటుచేసిన ఆస్పత్రి ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ వైద్యరంగంలో అనుభవం గడిచిన డాక్టర్ రాజేష్ కుమార్ స్వర్ణ హాస్పిటల్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించేందుకు మరో ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. ఎందుకంటే ఆసుపత్రి అధినేతలు డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ 15 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఉద్దేశంతో చిన్న క్లినిక్ ను ప్రారంభించామన్నారు. అప్పటినుంచి అందరికీ నాణ్యమైన వైద్యం అందిస్తూ రోగులు వారి కుటుంబ సభ్యుల మన్ననలను పొందామన్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అత్యధిక సౌకర్యాలతో మల్టీ స్పెషల్ వైద్య సేవలతో నూతన భవనాన్ని ఏర్పాటు చేశామన్నారు. గైనకాలజీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ , అత్యవసర వైద్య సేవలతో పాటు ఎక్స్ రే, స్కానింగ్, ల్యాబ్లేటరీ సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఆర్థోవిభాగాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 24 గంటలు అన్ని వ్యాధులకు అత్యవసర వైద్య చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ మునిశేఖర్ పాల్గొన్నారు.





మునిరత్నం నాయుడుకి చెవిరెడ్డి పరామర్శ

చంద్రగిరి : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత మునిరత్నం నాయుడుని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్విమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం పరామర్శించారు. అతనిపై జరిగిన దాడికి విచారం వ్యక్తం చేస్తూ దాడికి పాల్పడిన వారెవ్వరినీ ఉపేక్షించబోనని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. పల్లెల్లో రాజకీయ గొడవలకు తావు లేకుండా ప్రశాంతతను కోరుకుంటానని, తప్పు ఎవ్వరు చేసినా శిక్షకు సిద్ద పడాల్సిందే అన్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేయగా ప్రమాదం లేదని వైద్యులు వివరించారు.

13న స్విమ్స్ ఓపీకి సెలవు


ప్రజాశక్తి - తిరుపతి సిటి

దీపావళి పర్వదినం సందర్భంగా స్విమ్స్ ఓ.పి, ఓ.టి.లకు 13న సోమవారం సెలవు ప్రకటించారు. అత్యవసర సేవలు యధాతథంగా కొనసాగుతాయని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

గత పోలింగ్ ఘటనలపై నివేదిక ఇవ్వండి : కమిషనర్

తిరుపతి టౌన్: నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలపై నివేదిక సిద్ధం చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దష్టిలో ఉంచుకుని సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని అన్నారు. ఆ నివేదికలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని అన్నారు. పక్కగా సిద్ధం చేసిన నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళిశ్వర్ రెడ్డి, డిఎస్పీ సురేంద్ర రెడ్డి, సి.ఐ. జయ నాయక్ పాల్గొన్నారు.

తెలంగాణలో టిఆర్ఎస్ గెలవాలని గంగమ్మకు పూజలు



తిరుపతి టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ గెలవాలని శుక్రవారం తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో తిరుపతి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణ ప్రసాద్ పూజలు నిర్వహించారు. ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు కెసిఆర్ ముచ్చట గా మూడోసారి ముఖ్యమంత్రిగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని గంగమ్మను కోరినట్లు తెలిపారు.భవిష్యత్తులో కెసిఆర్ దేశ ప్రధాని కావాలని కోరుతున్నట్లు తెలిపారు. ఆలయ ఛైర్మెన్ కట్టా గోపి యాదవ్ , ఆలయ అర్చకులు ఆర్కాట్ కష్ణప్రసాద్ కు అమ్మవారి కండువాకప్పి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ సురేష్, డి.రాఘవరెడ్డి, సదుంప్రసాద్ పాల్గొన్నారు.

గతుకుల రోడ్డు..భయం గుప్పెట్లో ప్రజలు..


గుంతలమయమై ప్రమాదకరంగా మారిన రహదారి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఆలత్తూరు రోడ్డు అయోమయ పరిస్థితిలో ఉంది. ఆ పంచాయతీలో క్రషర్లు ఎక్కువగా ఉండటంతో అక్కడి నుండి మెటల్ లారీలు రోజూ వందల సంఖ్యలో తోలడంతో రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలమయం అయ్యింది. ఆలత్తూరు, పివికండ్రిగ పంచాయతీలకు వెళ్లే ఆర్టీసీ బస్సు గుంతల రోడ్డు కారణంగా మరమ్మతుకు గురైంది. ఆర్టీసీ బస్సు ఆపేయడంతో ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో ఎవరైనా అనారోగ్యం పాలైతే కనీసం ఆటోలు పోవాలన్నా పరిస్థితి దుర్భరంగా వుంది. రోడ్డు మరమ్మతులకు టెండర్లు పిలిచి ఆరు నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్లు మాత్రం ఎవరూ ముందుకు రావడంలేదు. పుత్తేరీ, యాలత్తురు, టీవీ కండ్రిగ రైతులు ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం స్కూలుకు వెళ్లాలన్నా బడి పిల్లలు చినుకు పడితే వర్షపు నీటితో నిండిన గుంతల రహదారిపై కనిపించక భయాందోళనతో స్కూలుకు వెళ్లలేని దుస్థితి ఎదుర్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఆ రోడ్డును బాగు చేసి తమకు సాయం చేయాలని ఆ మూడు పంచాయతీల ప్రజలు వేడుకుంటున్నారు. మండల ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని చిట్టేడులోని జీవిఆర్ కంపెనీలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ విచ్చేసి పలు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బాబురెడ్డి, దాసరి అశోక్ కాంబ్లే, కంపెనీ జనరల్ మేనేజర్ కృష్ణన్, జీవిఆర్ సిబ్బంది చిట్టిబాబు, లోక్ అదాలత్ స్టాఫ్ మదన్, పోలీసులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -కోట : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ కొయ్య మోషన్ రాజు, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, సిపాయి సుబ్రమణ్యంతో కలిసి కుటుంబ సమే తంగా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి శుక్రవారం దర్శించుకున్నారు. వీరితో పాటు గూడూరు నియోజకవర్గ వైసిపి యువజన విభాగ అధ్యక్షులు, చెందోడు పంచాయతీ యువ నాయకులు చిల్లకూరు. సాయి ప్రసాద్ రెడ్డిలు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలంలో రెండవ శనివారం సందర్భంగా నేడు ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు 33/11 కె వి విద్యుత్తు సబ్ – స్టేషన్లలో 11కెవి లైన్లలో నెలవారి మరమ్మతుల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడు తుందని, ఈ అంతరాయానికి చింతిస్తున్నామని శ్రీకాళహస్తి దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూరల్ డివిజన్ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ యెన్ వాసు రెడ్డి తెలిపారు. వినియోగదారులు సహక రించాలని కోరారు.

వైసిపి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని వైసిపి నాయకులు శుక్రవారం ఉదయం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైసిపి నాయకులు సున్నాలు గోపాల్ రెడ్డి, కోటీశ్వరుడు నాయుడు, అజయ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రాజా నాగూర్ నాయుడు సీనియర్ నాయకులతో పాటు పంచాయతీ సెక్రెటరీ ఇందిరమ్మ ప్రతి ఇంటిని పర్యవేక్షించి జగనన్న చేసిన కార్యక్రమాలు వివరించి వారికి సూచనలు, సలహాలు అందించారు. మళ్లీ జగనన్నను గెలిపిస్తే ఎవరికీ ఏం కావాలన్నా తప్పక నెరవేరుస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, వాలంటీర్లు పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు.

తిరుపతిని కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి -రేణిగుంట : తిరుపతి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర బీసీ సంఘర్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూల వెంకట యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తిరుపతి జిల్లాలో సుమారు 34 మండలాలు ఉన్నాయని ఆ మండలాల్లో తీవ్ర కరువు నెలకొని ఉందని కనీసం రైతుల పరామర్శించే రైతు కష్టాన్ని తెలుసుకునే నాథుడే లేడని పాలకులందరూ దోచుకునే పనిలోనే ఉన్నారని ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా వరి , వేరుశనగ, మామిడి ఇతర ఉద్యాన పంటలు పండిస్తున్నారని, వాటికి గిట్టుబాటు ధరలు లేక పంటలు అతి తక్కువ ధరకే విక్రయిస్తున్నారని దళారుల వద్ద మోసానికి గురవుతున్న రైతుల పరిస్థితి దీనంగా వుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తిరుపతి జిల్లాను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రసాయన శాస్త్రంలో వేణుగోపాల్ కు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ రసాయనశాస్త్ర పరిశోధక విద్యార్థి తొండూరు వేణుగోపాల్ కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టరు టి మధుసూదనరెడ్డి మార్గదర్శకత్వంలో "సింథసిస్, క్యారెక్టరైజేషన్, ఫ్యాబ్రికేషన్ ఆఫ్ కార్బన్–మీడియేటెడ్ ఎలక్ట్రోక్యాటలిస్ట్స్ ఫర్ ఎఫెక్టివ్ ఎలెక్ట్రోకెమికల్ మానిటరింగ్ ఆఫ్ న్యూరోట్రాన్స్మిటర్స్, హెపటోటాక్సిక్ డ్రగ్స్ అండ్ ఎన్విరాన్మెంటల్ టాక్సిన్స్' అంశంపై పరిశోధనలు నిర్వహించి విశ్వవిద్యాలయానికి పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఇందుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. టి వేణుగోపాల్ తన పరిశోధనలను పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లలో ప్రచురించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ పరి శోధనా సదస్సులలో పాల్గొని తన విలువైన పరిశోధనా పత్రాలను సమర్పించారు. టి. వేణుగోపాల్‌కు డాక్టరేట్ రావడం పట్ల రసాయన శాస్త్ర విభాగపు పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

ఎస్వీయూ ఓఆర్ఐలో ఆర్వో సిస్టం ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యా లయ ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ)లో ఓఆర్ఐ సంస్థ సంచాలకులు డా.పిసి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్వీయూ ఉప కుల పతి ఆచార్య కె.రాజారెడ్డి ఓఆర్ఐ పూర్వ పరిశోధక విద్యార్థులు బహూకరించిన ఆర్వోసిస్టంను కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సంచాలకులు డా. పిసి వెంకటేశ్వర్లు, ఆచార్య భాస్కర్ రెడ్డి, ప్రాచ్య పరిశోధన సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్దేశిత ప్రదేశాల్లోనే టపాసులు విక్రయించాలి: సిఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : దీపావళి సందర్భంగా గూడూరు పట్టణ పరిధిలో బైపాస్ రోడ్డు సమీపంలో కాశీ లేఔట్ లో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతులు జారీ చేశారని గూడూరు రూరల్ సిఐ దశరథ రామారావు తెలిపారు. సిఐ దశరథ రామారావు మాట్లాడుతూ టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, టపాసులు కొనుగోలు చేసేవారు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లైసెన్స్ లేకుండా ఎవరు దుకాణాలు ఏర్పడి చేయకూడదని, అలా ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గూడూరు రూరల్ , చిల్లకూరు మండలాల్లో అధికారులు నిర్దేశించిన స్థలంలో మాత్రమే టపాసులు దుకాణాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ఏర్పేడు: మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పాతవీరాపురంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల సుమారు 50 వేల రూపాయల విలువైన దుస్తులు, పుస్తకాలను స్థానిక యానాది కాలనీ పిల్లలకు రెండు జతల కొత్త దుస్తులు, 1నుండి 5 వరకు చదువుతున్న విద్యార్థులకు విలువైన పుస్తకాలు, రాత పలకలు, పెన్సిల్లు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా దాత రమేష్ నాథ్ లింగుట్ల మాట్లాడుతూ పేద పిల్లల కళ్లల్లో దీపావళి కాంతులు చూడాలని, బాలల దినోత్సవం పురస్కరించుకుని తాను ఈ సాయం తెలుగు పండితులు డాక్టర్ దేవరాజులు కోరిక మేరకు విద్యార్థులకు అందించానని వీడియో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 ఏ దయాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వే ఫౌండేషన్ అధ్యక్షులు పైడి అంకయ్య, ముని లక్ష్మి, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి శరత్, ఉపాధ్యాయులు డాక్టర్ దేవరాజులు, పద్మజ,వెంకటేశ్వర్లు, ఉషారాణి, ప్రకాష్ పాల్గొన్నారు.

దళితుల భూములను పెత్తందారులకు కట్టబెడుతున్నారు..

న్యాయం చేయాలని బాధితుల అభ్యర్థన


జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: దళితుల భూములను రెవెన్యూ అధికారులు అగ్రవర్ణాలైన పెత్తందారులకు కట్టబెడుతున్నారని, పై స్థాయి అధికారులు దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు అభ్యర్థిన్నారు. తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం కుక్కంబకం రెవెన్యూకు చెందిన దళిత పేద రైతు బుర్ర కృష్ణయ్య కుమారుడు బుర్ర వేణుకు చెందిన సర్వేనెంబర్ 301/8 బి నెంబర్లో ఒకటిన్నర ఎకరా పొలం దళితుల అసైన్‌మెంట్ కింద 1995లో బుర్ర వేణు తల్లి బుర్ర వెంకటసుబ్బమ్మ పేరుతో ఇచ్చారు. ఆ నమోదుతో పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకొని ఆన్‌లైనులో కెక్కించుకొని ఆ భూమిపై బ్యాంకు లోను, రైతు భరోసా, పిఎం కిసాన్ లాంటివి లబ్ధి పొందుతూ వృద్ధులైన వెంకటసుబ్బమ్మ అనేక పర్యాయాలు తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని, ఒక్క వెంకట సుబ్బమ్మకు మాత్రమే ఈ దుస్థితి లేదని, దళితులైన పేదవారికి చాలామందికి ఇలాంటి అన్యాయమే జరుగుతోంది బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ భూములను 52 మంది మహిళలకు ఒకటిన్నర ఎకరా చొప్పున ఇచ్చారని ఒక్కరికి కూడా రెవెన్యూ వాళ్లు భూమిని చూపించలేదని, భూమి చూపించకపోగా రెవెన్యూ అధికారులు సహకారంతో అగ్రవర్ణాల వారి వద్ద కొంత సొమ్ము ఆశించి ఆ భూమిని వారికి ఇవ్వడంతో వాళ్లు సాగు చేసుకునేవారిని తెలిపాడు. ఆ వృద్ధులు కాలం అయిన తర్వాత వారి పిల్లలు తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలతో ఈ బుక్కులను వారసులైన పిల్లల మీదకు మార్చుకున్నారని, అప్పటినుండి తల్లిదండ్రులకు ఎలాంటి పరిస్థితి ఎదురైందో పిల్లలకు కూడా అన్యాయం జరుగుతోందని తెలిపాడు. ఇదేమిటని స్పందనలో నిలదీయగా జెసి స్వయంగా తహశీల్దారు కార్యాలయానికి నివేదిక పంపి వారి భూమిని వారికి చూపాలని ఆదేశించినా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు లబ్ధిదారులను ఆరు నెలలుగా తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ కూడా తెచ్చుకున్నామని, అయినా కోర్టును ధిక్కరించి ఇప్పటికీ రెవెన్యూ అధికారులు అగ్రవర్ణాల వారికే సపోర్ట్ చేస్తున్నారని తెలిపాడు. స్పందనలో జెసికి ఇచ్చిన నివేదికను కూడా ఖాతాలు చేయడం లేదని ఒక సీనియర్ పాత్రికేయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించాలని కోరాడు. దీనిపై 10వ తేదీ బుచ్చినాయుడు కండ్రిగ మండల మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన జగనన్నకు చెబుదాంలో కుకుంబాకం దళితులు జెసికి అర్జీ రూపంలో భూమిని సర్వే చూపించాలని చలానా కట్టి తహశీల్దారు భార్గవి దగ్గర ఇన్సిల్ వేయించుకుని సర్వేయర్ వాసు కు ఇచ్చినా సర్వేయరు లబ్ధిదారులను లెక్కలేని స్థితిలో మాట్లాడడం బాధాకరంగా వుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి దళితులకు న్యాయం చేయాలని లేకుంటే జగనన్న ప్రాంగణంలోకి వెళ్లి తమ గోడు వెళ్లబుచుకుంటామని లబ్ధిదారులు వాపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు దళితులకు న్యాయం చేయకపోతే తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని బాధితులు హెచ్చరించారు.

ఈ క్రాప్ పంట నమోదు ధృవీకరణ పత్రాలు అందజేత


పంట ఈ క్రాఫ్ట్ నమోదు పత్రాలు అందిస్తున్న మండల వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని ఆమందూరు పంచాయతీ ఆర్‌బికె సెంటర్‌లో శ్రీకాళహస్తి ఏడిఏ రమేష్ రెడ్డి, ఏర్పేడు మండల వ్యవసాయ శాఖ అధికారి కె షణ్ముగం ఈ క్రాఫ్ పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ –2023 సీజన్లో 6,517 ఎకరాల్లో 3,690 మంది రైతులకు ఈ క్రాఫ్ యాప్‌లో పంట నమోదు పూర్తి చేశారు. దీనికి సంబంధించి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీ నిర్వహించి వచ్చిన అభ్యంతరాలను సవరించి తుది జాబితాను ప్రతి రైతు భరోసా కేంద్రాలలో ఉంచామని తెలిపారు. ఖరీఫ్ సీజన్లో పంట నమోదు చేసుకున్న రైతులకు ఈనెల 7వ తేదీ నుండి పంట నమోదు ధృవీకరణ పత్రాలను రైతు భరోసా కేంద్రా ల ద్వారా అంది స్తున్నా రు. మండ లం లోని రైతు సోద రులు తమ రైతు భరోసా కేంద్రాల అధికారులు సంప్ర దించి ఈ క్రాఫ్ పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను తీసుకోవాలని తెలిపారు.

రైతులకు ఈక్రాప్ పంట నమోదు పూర్తి


యర్రావారిపాలెంలో

యర్రావారిపాలెం: మండ లం లోని రైతులకు 2023 ఖరీఫ్ సీజన్లో 9433 ఎకరాలకు 3184 మంది రైతులకు ఈ క్రాప్ యాప్‌లో పంట నమోదు పూర్తి చేశారని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా శుక్రవారం తెలిపారు.మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీలు నిర్వహించి రైతుల నుండి వచ్చిన అభ్యంతరాలను సవరించి తుది జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఉంచామని ఏవో పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్లో పంట నమోదు చేసుకున్న రైతులకు ఏడో తేదీ నుండి పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను అన్ని రైతు భరోసా కేంద్రాలలో అందిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి రైతు స్థానిక రైతు భరోసా కేంద్రాలలో వారి పత్రాలను తీసుకోవాలని ఏవో కోరారు.

దొంగ ఓట్లు తొలగించండి..

తహశీల్దారు కార్యాలయం ఎదుట టిడిపి నాయకుల నిరసన


పాకాల తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పాకాల: దొంగ ఓట్లు తొలగించి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట టిడిపి మండల అధ్యక్షుడు బోయపాటి నాగరాజు నాయుడు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేలో అసంతృప్తిగా ఉన్న మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తహశీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఉల్లంఘించి వైసిపి ప్రభుత్వం నియోజక వర్గంలో దొంగ ఓట్లను కలుపుకొని, పోలింగ్ బూత్‌లు పెంచి దొంగ ఓట్లపై ఆధారపడి అధికారంలోకి రావాలని చూస్తోంద న్నారు. నియోజక వర్గంలో అర్హులకు ఓటు హక్కు కల్పించి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆదేశాల మేరకు దొంగ ఓట్ల అవకతవకల పై తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అందులో భాగంగానే ఎర్రావారిపాలెం మండలంలో దొంగ ఓట్లను వెంటనే తొలగించి అర్హత ఉన్న వాటిలో మాత్రమే నమోదు చేయాలని టిడివి, జనసేన నాయకులు ధర్నా నిర్వ హించారు. మండలంలో ఆరు నెలలుగా దొంగ ఓట్లు, మరణించిన వ్యక్తుల ఓట్లు వివాహం చేసుకొని బయట వెళ్లిన ఓట్లు వున్నాయని వెంటనే తొలగించాలని తహశీల్దారు కి పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని, వెంటనే తొలగించాలని కోరారు. లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి జిల్లా వ్యాప్తంగా మహా ధర్నాను నిర్వహించి ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళతామని హెచ్చరించారు.

ప్రజా సంక్షేమం వైసీపీకే సాధ్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు చేయడం ఒక్క వైసీపీకే సాధ్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయ ఆవరణలో నిర్వహించిన జగనే ఎందుకు కావాలంటే? కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో ప్రభుత్వం నుంచి ప్రజలకు అందిని పథకాలు నగదును ఎంపీడీవో నరసం భారావు చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ సచివాలయ పరిధిలో రూ.4 కోట్ల రూపాయిలు మేర ప్రజలకు అందించినట్లు తెలిపారు. ఇక నుంచి జరిగే కార్యక్రమంలో మండలం లో అన్ని శాఖధికారులు పాల్గొనేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర వైసీపీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు భరోసా

- చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు గంజిమాధవయ్య


టిడిపి పథకాలను వివరిస్తున్న టిడిపి నాయకులు గంజి మాధమయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాబోయే టిడిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు పథకాలను అందించి భరోసా కల్పిస్తామని చిత్తూరు పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య పేర్కొన్నారు. నగరి నియోజకవర్గం పుత్తూరు రూరల్ మండలం తడుకు గ్రామపంచాయతీ సుబ్బారెడ్డి వడ్డిండ్లు గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. అందులో భాగంగా రాబోయే టిడిపి ప్రభుత్వంలో మహాశక్తి, ఆడబిడ్డ నిధి, అన్నదాత, యువగళం, బీసిలకు రక్షణ చట్టం, పూర్‌టు రిచ్ వంటి పథకాలలో లబ్దిదారులకు ఏయే పథకాలు అందిస్తామన్న వివరాలతో ఆన్‌లైనులో జిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, పుత్తూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు డి.రవికుమార్, మాజీ అధ్యక్షుడు కరుణా యాదవ్, ప్రధాన కార్యదర్శి ఏ.బాలాజీ, యూనిట్ ఇన్‌చార్జులు ఆదిమండడి, అమరనాథ్, మాజీ ఎంపీటీసీ కోట గజపతి, టీడీపీ నాయకులు భాస్కర్ రెడ్డి, హేమంత్, హరిగోపాల్, శీనయ్య, శివ పాల్గొన్నారు.

డి3 ఫార్ములాను నమ్ముకున్నారు జగన్: హరిప్రసాద్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ధనం, దౌర్జన్యం, దొంగ ఓట్ల అనే డి3 ఫార్ములాను వైసిపి ఆయుధాలుగా మార్చుకుందని, వీటితో ఎలాగైనా మళ్ళీ అధికారంలోకి రావాలని సీఎం జగన్ చూస్తున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం చిత్తూరులో జనసేన కార్యాలయ ప్రారంభోత్సవంలో హరిప్రసాద్ టిడిపి నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ చిత్తూరు ప్రజలు సంతోషించే విధంగా జనసేన కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. 14 ఏళ్లు సిఎంగా పనిచేసిన చంద్రబాబు అనుభవం ప్రజలకు సేవ చేయాలన్న పవన్ కళ్యాణ్ ఆశయం ఈ రాష్ట్రానికి ఎంతో ముఖ్యమన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు గెలవాలని, పార్టీలు కాదన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ రాష్ట్రాన్ని, ప్రజలను గెలిపించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఒక పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తన ఉమ్మడి కుటుంబంలోనే 16 ఓట్లు ఉంటే వాటన్నింటినీ తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థులు గెలిచి తీరుతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం పర్యావరణానికి విఘాతం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ బిసిడిఈ, ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్, ఆధ్వర్యంలో ఎస్‌వి ఆర్ట్స్ కాలేజ్ నందు ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్ క్యాంపెయిన్‌పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ టి. నారాయణమ్మ, బిసిడిఈ కోఆర్డినేటర్ ఆచార్య సుధారాణి మాట్లాడుతూ భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ ప్రగతి సాధిస్తూ ఉందన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల ప్రతి ఇంట్లో ప్రతి చోటా అన్ని అవసరాలకు ప్లాస్టిక్ తో తయారు చేసిన వస్తువులు, కవర్లు వాడడం వల్ల ప్లాస్టిక్ కాలుష్యం ఇంటి వరకు చేరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి. సత్యనారాయణ, ఎకనామిక్స్ హెడ్, బిసిడిఈ కోఆర్డినేటర్ ఎస్ వి ఆర్ట్స్ కాలేజ్ ఎం.కిరణ్ కుమార్ రాజు, డాక్టర్ డి.రేఖ, డాక్టర్ డి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దారు పరమేశ్వర స్వామి బిఎల్‌వోలకు సూచించారు. స్థానిక పురపాలక సంఘం వైయస్సార్ భవనంలో బి ఎల్ ఓ లు రెవెన్యూ, మున్సిపల్, సిబ్బందితో ఓటర్ల జాబితాలపై మున్సిపల్ కమిషనర్ కే ఎల్ ఎం ఎన్ రెడ్డి, తహశీల్దారు పరమేశ్వర స్వామి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు, మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఓటర్లు చనిపోయిన వారు ఉంటే వాటిని పరిశీలించి తొలగించాలని, దొంగ ఓట్లు ఉంటే పరిశీలించి తొలగించాలని, కొత్తగా ఓటర్లు ఉంటే నమోదు చేయించాలని తెలిపారు. క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ వోలు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో ఘనంగా ఆయుధపూజ

కమిషనర్ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ లో శుక్రవారం సాయంత్రం కమిషనర్ హరిత ఆధ్వర్యంలో ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. కమిషనర్ హరిత, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొని దుర్గాదేవికి పూజలు చేసి, వాహనాలకు హారతులు పట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ లోని శుక్రవారం వాహన పూజను నిర్వహించామన్నారు. కార్మికులు అందరూ నగర పరిశుభ్రతకు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. దీపావళి ని నగర ప్రజలు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ఆనందంగా జరుపుకోవాలని అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ పర్యావరణ హితమైన టపాకాయలు పేల్చి కాలుష్య నివారణకు సహకరించాలని అన్నారు. నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు..ఈ పూజా కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, శేఖర్ రెడ్డి, ముని రామి రెడ్డి, సంధ్య, కోటేశ్వరమ్మ, దూది కుమారి, కో ఆప్షన్ మెంబర్ వెంకట్ రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాదవ్, డి.సి.పి. శ్రీనివాసులు రెడ్డి, ఏసిపి బాలసుబ్రహ్మణ్యం , హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసరు నాగేంద్ర, డి.ఈ.విజయకుమార్ రెడ్డి, మహేష్ ఉన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపిద్దాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం 22వ వార్డు పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్య మంత్రి జగనన్నను ఆశీర్వదించి మళ్లీ సీఎంను చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ముత్యాల పార్థసారథి, పగడాల రాజు, జనార్ధన్ పవార్, వాసునాయుడు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని వినతి

ప్రజాశక్తి -వెంకటగిరి : నిరుద్యోగ యువత యువకులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని గురువారం ఎమ్మార్వో సర్కిల్లో వైయస్ రాజశేఖర్రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కురుమల రామకృష్ణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. యువత యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి జాబ్ క్యాలండర్ ఎటాచ్ చేయాలంటూ వెంకటగిరి పట్టణంలోని పురవీధుల్లో తెలియజేసిన నాయకులు కార్యకర్తలు యువకులు ర్యాలీ నిర్వహించారు.

క్రైం న్యూస్

లారీ బోల్తా .. డ్రైవర్, క్లీనర్ సురక్షితం

ప్రజాశక్తి- ఏర్పేడు : అదుపు తప్పి లారీ బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవరు, క్లీనర్ సురక్షితంగా బయట పడిన సంఘటన మండలంలో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఏర్పేడు మండలంలోని మేర్లపాక సమీపంలో పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున శ్రీకాళహస్తి వైపు నుంచి మైసూర్ కు వెళుతున్న గోతాముల లోడ్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోకలు రద్దీ లేకపోవడంతో ఇతర వాహనాలకు ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ లు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ కేసును ఏర్పేడు సీఐ శ్రీహరి దర్యాప్తు చేస్తున్నారు.



మున్సిపల్ కార్మికులకు ఆదివారం సెలవు ప్రకటించాలి: సిఐటియు

ప్రజాశక్తి -గూడూరు: గూడూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గత కొన్ని సంవత్స రాలుగా ఆదివారం సెలవు రోజుగా ప్రకటించాలని కోరుతూ ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం రోజు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఏవోకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి యస్. సురేష్, కెవిపిఎస్ నాయకులు ఏ ప్రసాద్, మున్సిపల్ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బి పెంచల ప్రసాద్ (పిపి) మున్సిపల్ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు బి రమేష్, కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, బి చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం

ప్రజాశక్తి-పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కామర్స్ అధ్యాపకులు డాక్టర్ మాసులమని మాట్లాడుతూ మానవ జీవితంలో అకౌంటింగ్ కు ముఖ్య ప్రాధాన్యత ఉందని అన్నారు. అకౌంటింగ్ సంస్థల ఆర్థిక కార్యకలాపాల ఫలితాలను కొలవడంలో అకౌంటింగ్ ప్రధాన పాత్ర వహిస్తుందని అన్నారు. అకౌంటింగ్ ను ఫైనాన్షియల్ అకౌంటింగ్, మేనేజ్మెంట్ అకౌంటింగ్,టాక్స్ అకౌంటింగ్, కాస్ట్ అకౌంటింగ్ అని పలు రకాలుగా విభజించ వచ్చన్నారు. డాక్టర్ రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు అకౌంటింగ్ తో పాటు అకౌంటింగ్ బులిటి కూడా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్ బెహరా,డాక్టర్ ఈశ్వర బాబు, వినోద్,లక్ష్మీ ప్రసన్న,మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ వేణు మృతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు పంచాయతీ సర్పంచ్ వేణు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కాటూరు పంచాయతీ అభివృద్ధిలో వేణు పాత్ర కీలకమని ప్రజలు తెలిపారు. ఆయన మృతి పట్ల ఎంపీటీసీ రవి, సర్పంచ్ చిరంజీవి, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం పరిధిలోని నెల్లటూరు కు చెందిన శ్రీనివాసులు గూడూరు కలుజు ప్రాంతంలో బైక్ మెకానిక్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అరోగ్యం భాగాలేక ఇంటికే పరిమితమయ్యాడు. శ్రీనివాసులు అనాగ్యం విషయం తెలుసుకున్న గూడూరు టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసులు ఇంటికి వెళ్లి అతడిని పరామర్శించి పండ్లు, వెద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా గూడూరు టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసులు మాట్లడుతూ త్వరగా కోలుకుని ఎప్పటిలాగే మెకానిక్ పనులు చేసుకోవాలని ఆకాంక్షించారు.

ఆయుర్వేదం ద్వారా వత్తిడి లేని జీవన విధానం

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఎన్.ఎం.పీ.బీ మంజూరు చేసిన ఎస్టాబ్లిష్మెంట్ ఆఫ్ మెడిసినల్ గార్డెన్ ఇన్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రాజెక్టులో భాగంగా విద్యార్థినులకు, ఆయుర్వేదం విశిష్టతను గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఇన్వెస్టిగేటర్ లు ప్రొఫెసర్ విజయకుమారి, డా.సువర్ణలత, డాక్టర్ శాంతిశ్రీ, డిపార్ట్మెంట్ మెంట్ ఆఫ్ బయోసైన్సెస్ అండ్ సెరికల్చర్ ప్రొఫెసర్ సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చెకుముకి సైన్స్ సంబరాలు 2023 పురస్కరించుకొని పరీక్షలను నిర్వహించినట్లు జన విజ్ఞాన వేదిక తిరుపతి జిల్లా కన్వీనర్ రెడ్డప్ప ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 25 వేల మంది విద్యార్థులు ఈ చెకుముకి పరీక్షలను రాశారన్నారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో నిర్వహించిన ఈ చెకుముకి పరీక్షల్లో అర్హత సాధించిన వారు మండల, పట్టణ స్థాయిలో పోటీలకు అర్హత సాధించారన్నారు.

శేషాచలం పుష్ప(లు) ఎవరు: నవీన్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రపంచంలోనే అరుదైన సంపదగా గుర్తింపు పొంది అక్రమంగా దోచుకోబడుతున్న ఎర్రచందనం స్మగ్లర్ల వెనుక ఉన్న శేషాచలం పుష్ప(లు) వెనుక నడిపిస్తున్న వారు ఎవరని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్ కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. దశాబ్దాల కాలంగా ఎర్రచందనం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుందంటే ఇంటి దొంగల సహకారం లేకుండా జరిగే పని కాదని, దీర్ఘకాలికంగా ఆయా శాఖల్లో శిష్ట వేసిన అధికారులను వెంటనే సాగనంపి శేషాచలం అడవుల సంపద అయిన ఎర్రచందనాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఇంత తంతు జరుగుతున్న ప్రభుత్వ నిఘా వ్యవస్థల పనితీరుపై ప్రజలు అనుమానించే సందర్భాలు కలుగుతున్నాయన్నారు. శేషాచలం అడవుల మార్గాల గుండానే కాకుండా ఏకంగా తిరుమల నుండి టోల్గేట్ ద్వారా రాజ మార్గంలో అధికార బలంతో, అధికారుల సహకారంతో ఎర్రచందనం దుంగలను స్మగ్లింగ్ చేసి పట్టుబడ్డ వాహనాల యజమాని ఎవరు? స్మగ్లర్ల వెనక ఉన్న సూత్రధారి ఎవరనే విషయాలను విజిలెన్స్,పోలీస్, అటవీ శాఖ, అధికారులు బహిరంగ ప్రకటన చేయాలన్నారు. ఎర్రచందనంను కొల్లగొడుతున్న పుష్ప ల భరతం పట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, అటవీ, టీటీడీ విజిలెన్స్, పోలీస్ అధికార యంత్రాంగాన్ని శ్రీవారి భక్తునిగా డిమాండ్ చేస్తున్నానన్నారు. ఎర్రచందనం సంపదన సంరక్షించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు నిఘా సంస్థలకు లేఖ రాస్తున్నానన్నారు.

మార్కెట్లోకి నూతన నిస్సాన్ ఆవిష్కరణ



ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): ప్రపంచ గుర్తింపు కలిగిన నిస్సాన్ తన నూతన ఉత్పత్తి కారు నిస్సాన్ మ్యాగ్నెట్ ఈజెడ్ షిఫ్ట్ ఎఎంటి కారును విడుదల చేసింది. ఈ నూతన ఆవిష్క రణను శుక్రవారం తిరుపతి లోని సీజేఎన్ హైటెక్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ షో రూములో మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు సిహెచ్.నిరంజన్, సి. హెూషిమా రెడ్డి, సి.భారతి పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నిరంజన్ మాట్లాడుతూ షిఫ్ట్ ఏఎంటి నూతన ఆవిష్కరణలో ఎన్నో ఆధునిక సదుపాయాలను కంపెనీ ఏర్పాటు చేసిందని, మార్కెట్ లో 6.49 లక్షల రూపాయలుగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎస్వీఎస్ శాస్త్రి, సేల్స్ మేనేజర్ మురళి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.